
పంట నష్టాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఎట్టకేలకు మూసుకున్న
కెనాల్ గేట్లు

- 24 గంటల్లో మూసేసిన అధికారులు
- లీకేజీతో జగదేవ్‌పూర్ మండలంలో పంట నష్టం
- పరిశీలించిన కలెక్టర్, వ్యవసాయాధికారి

జగదేవ్‌పూర్/ మర్కుక్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొండ పోచమ్మ రిజర్వాయర్ నుంచి జగదేవ్‌పూర్, భువనగిరి వైపు వెళ్లే జగదేవ్‌పూర్ కెనాల్ గేట్లు ఎట్టకేలకు మూసేశారు. బుధవారం గేట్లు మూసుకోకపోవడంతో గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతుండగా, అధికారులు గురువారం రాత్రి గేట్లను మూసివేశారు. 24 గంటల పాటు శ్రమించి గేట్లను మూసివేయడంతో ప్రమాదం తప్పింది. నిరంతరాయంగా లీకేజీ అవుతుండడంతో జగదేవ్‌పూర్ కాలువపై నీటి పారుదలశాఖ అధికారులు గండి కొట్టారు. దీంతో పరిసర ప్రాంతాల్లో వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప, ములుగు ఏడీఏ అనిల్‌కుమార్ గురువారం నష్టపోయిన పంటలను పరిశీలించారు. జగదేవ్‌పూర్, ఇటిక్యాల గ్రామాలకు చెందిన

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి గురుద్వారా వేడుకల్లో జగ్గారెడ్డి

- డోలక్ వాయిస్తూ ప్రార్థనలో పాల్గొన్న జగ్గారెడ్డి
- సంప్రదాయకంగా ఆశీర్వదించిన సిక్కు మతపెద్దలు
- ర్యాలీలో కత్తి విన్యాసంతో జోష్ నింపిన జగ్గారెడ్డి
- గురుద్వారాకు వెళ్లేదారిలో కమాన్ నిర్మాణానికి హామీ
- సిక్కులకు ప్రత్యేక కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు నిర్ణయం


గురునానక్ జయంతి ఉత్సవాల్లో జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ 556వ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని పురాతన గురుద్వారాలో ఘనంగా ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తూర్పు జగ్గారెడ్డి గురుద్వారాను సందర్శించగా మత పెద్దలు సాంప్రదాయ రీతిలో ఆయనను ఆశీర్వదించారు. అనంతరం జరిగిన భజన లో డోలక్ వాయిస్తూ ఆకర్షించారు. తర్వాత పట్టణంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొని కత్తి విన్యాసాలు చేస్తూ జగ్గారెడ్డి జోష్ నింపారు. సిక్కు మత పెద్దల కోరిక మేరకు గురుద్వారాకు వెళ్లేదారిలో


సంగారెడ్డి పురాతన గురుద్వారాలో జరిగిన గురునానక్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి

కమాన్ ఏర్పాటు చేయిస్తానని, అదేవిధంగా సిక్కుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. తగిన డిజైన్ చేసుకుంటే తాను కట్టిస్తానని చెప్పారు.

పురానికి వరం

- మున్సిపాలిటీలకు నిధుల వరద
- ఐదింటికి రూ. 82.40 కోట్లు మంజూరు!



- అభివృద్ధే లక్ష్యంగా టీయూఎఫ్ఐడీసీ నిధులు విడుదల
- మెరుగుపడనున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాలు
- త్వరలో టెండర్ల ఆహ్వానం

సిద్దిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా అభివృద్ధి పనులు నిధుల లేమితో నిలిచిపోయి, వెలవెలబోయిన జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు ఎట్టకేలకు మహర్దశ పట్టనుంది. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) కింద ఏకంగా రూ. 82.40కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు పెద్ద ఊరటనివ్వనున్నాయి. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి పంపిన నివేదిక ఆధారంగా, జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో త్వరలోనే పనుల ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం రూ. 82.40 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. సిద్దిపేట మున్సిపల్‌లో పాలకవర్గం అనుమతి, మిగతా మున్సిపల్‌లో ఉన్నతాధికారుల నుంచి ఆమోదం పొందగానే, పనులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించనున్నారు. సిద్దిపేట మున్సిపల్‌లో 48 పనులకు గాను రూ. 18.70 కోట్లు, గజ్వేల్‌లోనూ రూ. 18.70 కోట్లు, మిగతా దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో రూ. 15 కోట్ల చొప్పున మంజూరైన నిధులను ఖర్చు చేయనున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఈ నిధులను వచ్చే ఏడాది మార్చి లోపు పనులు పూర్తి చేసేలా ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్నది. ఈ నిధులు ముఖ్యంగా వరద కాలువలు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, చెరువుల వద్ద అభివృద్ధి పనులు, పార్కులు, జంక్షన్ల సుందరీకరణ, మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు తదితరమైన వాటి కోసం వినియోగించనున్నారు. మున్సిపాలిటీలకు నిధులు మంజూరు కావడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా ప్రారంభించి నాణ్యతతో నిర్మించాలని కోరుతున్నారు.

త్వరలో టెండర్ల ఆహ్వానం



సిద్దిపేట మున్సిపల్‌కు మంజూరైన రూ. 18.70 కోట్లతో ఆగిపోయిన పలు అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తాం. అందుకు పట్టణంలో 48 పనులకు గానూ ఆ నిధులను ఖర్చు చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాం. నిర్ణీత గడువు లోపు పనులను పూర్తి చేసేలా కసరత్తు చేయడంతో పాటు నాణ్యత విషయంలోనూ రాజీపడకుండా నిర్మాణాలు జరిగేలా చూస్తాం. పట్టణంలో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో డ్యామేజ్ అయ్యాయో ఆ ప్రాంతాల్లో రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం.

- ఆశిత్‌కుమార్, కమిషనర్, సిద్దిపేట మున్సిపల్



ట్రిప్..ట్రాప్

ఉచిత విదేశీయాత్రల ముసుగులో దందా

- ఈవెంట్స్, ఫ్రీ ట్రిప్‌ల ఆశ చూపి.. జూదంలోకి లాగి రూ.లక్షలు స్వాహా
- మోసపోతున్న గజ్వేల్ యువత
- ఇప్పటికే కొందరు అప్పుల ఊబిలో..
- మరికొంతమందికి గాలం వేస్తున్న దోపిడీదారులు

"విదేశీ విహారం... ఉచిత భోజనం... మందు విందు! మీరు ఇక్కడ ఫ్లైట్ ఎక్కిన దగ్గర నుంచి సకల సౌకర్యాలు.. అబ్బో ఇంకా చాలా ఉన్నాయి" అంటూ కొందరు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. అయితే, ఇదంతా తెలియని గజ్వేల్ యువత వారు చెప్పిందంతా నిజమనుకుని నమ్మి... నిండా మునుగుతున్నారు. ఈవెంట్స్ పేరుతో నడిచే ఈ కొత్త తరహా దందాలో... ఆశ చూపి, మత్తులో ముంచి దోపిడీదారులు రూ.లక్షల్లో కొట్టేస్తున్నారు. మస్తు ఎంజాయ్ చేసి బాగా డబ్బులు సంపాదిద్దామనుకుని వెళ్లిన యువతకు తిరిగొచ్చేసరికి అప్పుల ఊబిలో కూరుకుపోయి, రోడ్డున పడుతున్నారు

- గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)

విదేశాల్లో ఈవెంట్స్ పేరుతో కొందరు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. అమాయక యువతకు ఉచిత విదేశీ ప్రయాణం, విలాసవంతమైన వసతి, భోజనం, ఖరీదైన మద్యం ఏర్పాట్లు చేస్తామని ఆశ చూపి, వారిని బురిడీ కొట్టిస్తున్నారు. విదేశీయానానికి అవసరమైన విమాన టికెట్లు, విడిది, భోజనం, మందు... ఇలా అన్ని ఏర్పాట్లు తామే చూసుకుంటామని నమ్మబలికి, బాధితుల నుంచి పాస్‌పోర్టు, ఆధార్ కార్డు వంటి పత్రాలు తీసుకుని టికెట్లు బుక్ చేస్తున్నారు. ఉచితంగా విదేశీ ట్రిప్ వస్తుందని, అంతా ఫ్రీగా లభిస్తుందని భావిస్తున్న పలువురు... తీరా తిరిగి వచ్చాక తమ జేబులకు పడిన చిల్లులు చూసి బోరుమంటున్నారు. ఉచితంగా వస్తుందని భావించి వెళితే, అప్పులు మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త తరహా దందాకు ప్రస్తుతం గజ్వేల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులు బాధితులుగా మారుతున్నారు.

మందు ముందర పెట్టి... మాయ చేసి!

విదేశాలకు తరలించిన అనంతరం, విడిది ప్రదేశంలో భోజనం, వసతితో పాటు మద్యాన్ని ఉచితంగా ముందర పెడుతున్నారు. మద్యం మత్తులో ఉన్న సమయంలోనే, నిర్వాహకులు జూదం, అందర్‌బాహర్, ఇతర గేమ్స్‌ను మొదలు పెడుతున్నారు. దీంతో అప్పటివరకు ఉచితంగా విహారం అనుకున్న యువత... మద్యం ప్రభావంతో, చుట్టుపక్కల వారు ఆడుతుండటం చూసి, తామూ ఆడితే పోలా అని భావిస్తున్నారు. ఈ ఉచ్చులో పడి రూ. లక్షల్లో పోగొట్టుకుని రోదిస్తున్నారు. ఇక మద్యం సేవించిన అనంతరం, తమ మిత్రులకు, తెలిసిన వారికి ఫోన్ చేసి, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేయించుకోవడం లేదా అప్పుగా తీసుకుని మరీ గేమ్స్, జూదం ఆడుతూ...డబ్బు పోగొట్టుకుంటున్నారు.

రోడ్డున పడుతున్న యువత

ఇప్పటికే ఇలా చాలా మంది యువకులు రోడ్డున పడ్డట్లు తెలుస్తోంది. గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనమైన ఒక గ్రామానికి చెందిన దాదాపు 50 మందికి పైగా యువత ఇలా విదేశాలకు వెళ్లి రూ.లక్షల్లో పోగొట్టుకుని అప్పుల పాలయ్యారు. ప్రస్తుతం వారికి కనీస ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితికి చేరుకున్నారు. తాజాగా, మున్సిపాలిటీ పరిధితో పాటు రాయపోల్ మండలాలకు చెందిన యువత కూడా ఈ మాయలో పడి రూ.లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నట్లు సమాచారం.


పలు దేశాలకు...

ఈ దందాలో భాగంగా ఇప్పటికే బ్యాంకాక్, శ్రీలంక, వియత్నాం, జార్జియాతో పాటు మన దేశంలోని గోవాకు సైతం ఈవెంట్స్ నిర్వాహకులు యువతను తీసుకువెళ్లినట్లు తెలిసింది. తాజాగా, మరోసారి మరిన్ని దేశాలకు తీసుకువెళ్లేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యువతను విదేశీయానం పేరిట

మిగతా 8వ పేజీలో

బదిలీ చేసినా వెళ్లట్లే..

- ఓ ఉపాధ్యాయుడి నిర్వాకం
- ఫిర్యాదు చేసిన మాజీ ప్రజాప్రతినిధులు



మర్కుక్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఓ ఉపాధ్యాయుడిని బదిలీ చేస్తే.. ఆయన ఎక్కడా విధులకు హాజరుకావడం లేదు. ఇటు పాత పాఠశాలకు.. అటు కొత్తగా బదిలీ అయిన పాఠశాలకు వెళ్లకపోవడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. చేబర్తి మాజీ ఉప సర్పంచ్ గుర్రాల స్వామి, పాఠశాల మాజీ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కీర్తిరాములు, మాజీ వార్డు సభ్యుడు కోయల్‌కార్ జయరాం, గ్రామానికి చెందిన యువకులు మండల విద్యాశాఖాధికారికి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ములుగు మండలం క్షీరసాగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేసే బయాలజీ స్కూల్ అసిస్టెంట్ జి. కిష్టయ్యను వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా మండలంలోని చేబర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన ఈ నెల 1న ఉత్తర్వులు జారీ కాగా, ఆయన ఇటు చేబర్తి పాఠశాలలో రిపోర్ట్ చేయలేదు సరికదా, పాత పాఠశాలలోనూ విధులు నిర్వర్తించడం లేదు. ఓ పక్క పదో తరగతి సిలబస్ పేరుకుపోతుండటంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో మాజీ ప్రజాప్రతినిధులు విషయాన్ని మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మండల విద్యాధికారి వెంకటరాములు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మాజీ ప్రజాప్రతినిధులు తెలిపారు. డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడు వస్తారని పదో తరగతితో పాటు ఇతర తరగతుల విద్యార్థులు ఆశించారని, ఆయన రాకపోవడంతో సిలబస్ పేరుకుపోతోందని చేబర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా డిప్యూటేషన్‌పై బదిలీ అయిన కొందరు ఉపాధ్యాయుల తీరు ఇలాగే ఉందని, బదిలీ అయిన స్కూల్‌కు వెళ్లకుండా కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.



ఆకట్టుకున్న
భూకైలాస్ నాటకం

ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో గురువారం వినాయక నాట్య మండలి సురభి కళాకారులు భూ కైలాస్, సతి సావిత్రి నాటకాలను ప్రదర్శించారు. ముందుగా కార్యక్రమాన్ని ఆలయ ఏఈవో శ్రీనివాస్, ఎస్ఐ రాజుగౌడ్ జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. నాటకాన్ని భక్తులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- కొమురవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)


నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక దీపం ఆకృతిలో దీపాలు వెలిగించిన భక్తులు

నాచగిరిలో దీపారాధన

వర్గల్/కొండపాక/కొమురవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నిత్య కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ మండపంలో కార్తీక దీపం ఆకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారరులు, భక్తులు పాల్గొన్నారు

రెండోరోజు వార్షికోత్సవ ప్రత్యేక పూజలు

కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చండీ హోమం, 108 కళాశాలతో పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మల్లన్న ఆలయంలో వేలం పాట

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి శెల్లాలను,పట్నాల వేసే తెల్ల వస్త్రాలు, ఇతర వస్త్రాలను సరఫరా చేయడానికి గురువారం ఆలయ పాలకవర్గ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో అనంతుల కేదారి క్లాత్ మర్చంట్ వరంగల్ వారు టెండర్ దక్కించుకున్నారు. గుట్టపై రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు అమ్ముకోవడానికి, అన్నదాన సత్రం ముందున్న శివ సదనంలోని షెటర్లకు టెండర్ దరఖాస్తులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ కార్యనిర్వహణధికారి టంకశాల వెంకటేష్ తెలిపారు.

పిల్లలు తెల్లని మల్లెలు..

- సామాజిక, సాంఘిక అసమానతలను దాటితే ప్రగతి పరిమళాలు : సీపీ


పెద్దగుండవెల్లిలో మాట్లాడుతున్న సీపీ విజయ్‌కుమార్

దుబ్బాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరి జీవితంలో కష్టాలు తప్పకుండా వస్తాయనీ, పిల్లలు తెల్లని మల్లెలనీ, సామాజిక, సాంఘిక అసమానతలను దాటి వస్తేనే భవిష్యత్‌లోప్రగతి పరిమళాలను వెదజల్లుతారని సీపీ విజయ్‌కుమార్ అన్నారు. సమాజం గురించి అవగాహన పెంచుకోవడానికి విద్యార్థుల్లో పుస్తక పఠనం ఎంతో అవసరమని ఆయన సూచించారు. గురువారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. అలాగే గ్రామంలోని సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వాలీబాల్ క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఇంటర్‌నెట్‌ను మంచికి ఉపయోగించుకోవాలి చెప్పారు. సాంకేతికాభివృద్ధి చెడుకు మార్గం కాకూడదని సూచించారు. అందులోని చెత్తను పక్కకు నెట్టి, మంచి సందేశాలు, విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. మైనర్లుగా వాహనాలు నడపకూడదన్నారు. తండ్రులు మద్యం తాగి వాహనాలు నడపకూడదని, వారిని చైతన్యం చేయాలని విద్యార్థులకు చెప్పారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కీర్తిరాజు, రేణుకా మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, చేపూరి శేఖర్‌గౌడ్, కొండ్ర యాదగిరి, చందిరి దుర్గారెడ్డి, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, బండారి రామచంద్రం, గుండెల రవి, పంజ సత్యం, దండు రాజు, గూడ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హద్దుల వివాదాన్ని పరిష్కరిస్తాం

- కలెక్టర్ హైమావతి
- వర్గల్ టీజీఐఐసీ భూముల పరిశీలన


టీజీఐఐసీ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

వర్గల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలో టీజీఐఐసీకి (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) కేటాయించిన సర్వే నంబర్ 1641, 1642లో కంపెనీలకు, పట్టాదారులకు భూమి హద్దుల విషయంలో తలెత్తిన సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండల కేంద్రంలోని హద్దుల వివాదానికి కారణమైన టీజీఐఐసీ భూములను ఆమె పరిశీలించారు. 1641, 1642లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని ఏడీ సర్వే ల్యాండ్ వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. టీజీఐఐసీలో పరిశ్రమలు రావడం వలన వర్గల్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల ప్రతినిధులకు, పట్టాదారు రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట టీజీఐఐసీ ఎండీ కాశిరెడ్డి, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ రఘువీర్ రెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, రైతులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ పెంచాలి

వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అటెండెన్స్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. పాత ఆసుపత్రి నుంచి ఫర్నీచర్‌ను మార్చాలని, మెడిసిన్ కొరత లేకుండా పంపిణీ చేయాలని డీఎంహెచ్‌వోను ఫోన్ ద్వారా ఆదేశించారు.

ఇసుక చోరీకి పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

నంగునూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నంగునూరు పెద్దవాగు నుంచి ఇసుక దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు రాజగోపాల్‌పేట ఎస్సై వివేక్ తెలిపారు. నంగునూరు చెందిన కందికట్ల పర్శరాములు దొంగతనంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఇసుక దొంగతనం విషయంలో పంచనామ నిర్వహించి నిందితుడి పై సుమోటో కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. మండలంలోని పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ వివేక్ హెచ్చరించారు.

సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో పోలీసుల అవగాహన సదస్సు

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, సెల్‌ఫోన్‌ల ద్వారా ఆడపిల్లలకు కలిగే అనర్థాలపై గురువారం సిర్గాపూర్ ఎస్సై మహేష్ అవగాహన కల్పించారు. సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌ల ద్వారా ఎన్ని లాభాలు ఉన్నాయో, అంత కంటే ఎక్కువ నష్టాలు ఉన్నాయని అన్నారు. ఫోటోల మార్ఫింగ్‌లు, లింకులు టచ్ చేయడంతో డబ్బులు కొట్టేయడం, ఇలా అనేక రకాలుగా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, వీటికి విద్యార్థులు ముఖ్యంగా ఫోన్‌లకు బాలికలు దూరంగా ఉండాలని, త్వరలోనే పరీక్షలు ఉన్నందున చదువు పట్ల దృష్టి పెట్టాలని ఎస్సై మహేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంఈఓ నాగారం శ్రీనివాస్, హెచ్‌ఎం లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయనమ్మ మందలించిందని ఆత్మహత్య


కరుణాకర్ (ఫైల్)

కొండపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏం పని చేయడం లేదని నాయనమ్మ మందలించడంతో మనవడు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడిన సంఘటన కొండపాకలో గురువారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... కొండపాక గ్రామానికి చెందిన తడకపల్లి కరుణాకర్(27) తన తల్లిదండ్రులు మృతి చెందడంతో నాయనమ్మ లచ్చవ్వతో కలిసి ఉంటున్నాడు. కరుణాకర్ ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ బ్యాంకులో తొమ్మిది లక్షల రూపాయలు రుణం తీసుకున్నాడు. ప్రతినెల 14 వేల రూపాయలు బ్యాంక్‌కు వాయిదాలు చెల్లిస్తున్నాడు. ఏం పని లేకపోవడంతో నెల నెల కట్టాల్సిన సొమ్ము ఎలా అని నాయనమ్మ లచ్చవ్వ బుధవారం రాత్రి మందలించింది. నెలరోజుల నుంచి నీవు ఏ పనికి పోవడం లేదు నా ఆరోగ్యం బాగాలేదు, ఇంటికి సంబంధించిన రుణం ఎలా కడతావని మందలించింది. అదే రాత్రి లచ్చవ్వ గ్రామంలో ఉన్న మనవరాలు ఇంటికి వెళ్లింది. కలత చెందిన కరుణాకర్ రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం చూసేసరికి వేలాడుతూ కనబడ్డాడు. మృతుడి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి


సర్దార్ తులసీ సింగ్ (ఫైల్)

పటాన్‌చెరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని మోటారుసైకిల్ ఢీకొని దుర్మరణం పాలయిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఐడీఏబొల్లారం పట్టణం అంబేడ్కర్ కాలనీలో ఉంటున్న సర్దార్ తులసీ సింగ్ (38) గురువారం ఉదయం ఔటర్ సర్వీస్‌రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బచ్చుగూడ కు చెందిన మౌనేందర్‌రెడ్డి మోటారుసైకిల్‌పై వచ్చి ఢీకొట్టాడు . బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. బాచుపల్లిలోని మమత ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ మేరకు భార్య సర్దార్ దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నకిలీ గన్ కలకలం



నకిలీ సీజర్ గన్‌ను చూపుతున్న మెదక్ రూరల్ సీఐ జార్జ్

హవేళిఘణపూర్ నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు నకిలీ గన్‌తో బెదిరించిన ఘటన మండలంలో గురువారం కలకలం రేపింది. మెదక్ రూరల్ సీఐ జార్జ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన హవేళిఘణపూర్ శివారులో మాజీ సైనికుడికి విల్సన్ గ్రామానికి చెందిన ఎల్లానికి భూవివాదం 20 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ కేసు కోర్టులో కూడా ఉంది. కాగా ఎల్లం కోర్టుకి వెళ్లి స్టే తీసుకువచ్చాడు. గురువారం ఉదయం ఎల్లం కబ్జాలోకి వెళ్లేందుకు యత్నించాడు. నాగాపూర్‌కు చెందిన భూమి యజమాని కొడుకు నీలేశ్వర్, మోహన్ తన స్నేహితులతో కలిసి అక్కడికి చేరుకుని లైటర్ పిస్తల్ చూపి కాల్చివేస్తామని ఎల్లాన్ని బెదిరించాడు. వెంటనే ఎల్లం 100 కు సమాచారం అందించాడు. వెంటనే స్థానిక పోలిసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. దానిని పరిశీలించగా లైటర్ పిస్తల్ అని తేలింది. దీనిని ఫ్లిప్‌కార్డులో కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

పటాన్‌చెరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల నుంచి బలవంతంగా జరుపుతున్న భూసేకరణ నిలిపివేయాలని సీపీఎం కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఇంద్రేశం పురపాలక పరిధి చిన్నకంజర్ల గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేనంబర్లు 113 లో 160మంది రైతులకు చెందిన 180 ఎకరాల భూమిని 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ రైతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరించి రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.

జాతీయ సాహస శిబిరానికి తారా విద్యార్థిని


శేరి శ్రీవిద్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సాహస శిబిరానికి సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాల విద్యార్థిని శేరి శ్రీవిద్య ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఈ నెల 9 నుంచి 19 వరకు నిర్వహించనున్న శిబిరంలో ఆమె పాల్గొననున్నారు. ఓయూ నుంచి ఐదుగురు ఎంపిక కాగా అందులో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎంపికకావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. విద్యార్థిని అధ్యాపక బృందం అభినందించింది.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిద్దిపేట జిల్లా విద్యార్థులు

ములుగు/మద్దూరు/నంగునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన సిద్దిపేట జిల్లాకు చెందిన పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 4న తూప్రాన్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ములుగు మండలంలోని క్షీరాసాగర్ జడ్పీహెచ్‌ఎస్ బాలికలు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన భార్గవి, అరుణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లిలో నిర్వహిస్తున్న 58వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో చాంపియన్ షిప్‌లో వీరు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రధానోపాధ్యాయులు బండ రవికుమార్ తెలిపారు. బాలికలను ఉపాధ్యా బృందంతో పాటు కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ కొన్యాల మమతాబాల్‌రెడ్డి అభినందించారు. సెప్టెంబరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో ప్రతిభ కనబర్చిన మద్దూరు మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గిలో జరగనున్న పోటీల్లో బానోతు ఐశ్వర్య, పోకల మాన్యత, తాళ్లపల్లి సింధు, సలాది ఆదిత్య పాల్గొంటారని పేర్కొన్నారు. సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో రాణించిన నంగునూరు మండలం గట్ల మల్యాల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఐదుగురి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రమేష్ తెలిపారు. పాఠశాలకు చెందిన బి.ప్రియా, బి.హరిణిప్రియ, అఖిల బి.అశ్విని, ఎం.వైష్ణవి జగిత్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులు, పీడీ రాజ్‌కుమార్‌ను పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కళా ఉత్సవ్ పోటీలకు ఖేడ్ విద్యార్థులు ఎంపిక

నారాయణఖేడ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఖేడ్‌లోని ఈ తక్షిలా పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శరత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థుల్లో రోజలిన, సుప్రియ, సంయుక్త, అక్షర, కృష్ణవేణి, శ్రీ చైతన్య, వర్షిణి, సాయిస్ఫూర్తి, అనిల్, నిఖిల్, చక్రధర్, ధనూష్ ఉన్నారని పేర్కొన్నారు. వారిని కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్ఈఐఎల్ యాత్రకు మనోహరాబాద్ యువకుడు


చెలిమెల ధృహన్

మనోహరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక జాతీయ సమైక్యత యాత్రకి ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు ధృహన్ ఎంపికయ్యాడు. మనోహరాబాద్ మండలం కేంద్రానికి చెందిన చెలిమెల ధృహన్ ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. స్టూడెంట్ ఎక్స్పీరియన్స్ ఇన్ ఇంటర్‌స్టేట్ లివింగ్ పేరుతో దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి 70 మంది ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ధృహన్ వెళ్లనున్నాడు.


చెర్లగూడెంలో విరగపూసిన బంతిపూల తోట

పూల తోట.. సిరుల బాట!

బంతిపూల సాగు వైపు రైతుల ఆసక్తి

హైదరాబాద్ మార్కెట్ అందుబాటుతో పెరిగిన డిమాండ్

ఎకరానికి రూ.5 లక్షల వరకు లాభం

కంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలైన వరి, పత్తి సాగులో తరచూ నష్టాలను చవిచూస్తున్న రైతులు ఇప్పుడు ఉద్యాన, వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని కంది మండల రైతులు, పత్తిలో ఆశించిన దిగుబడి రాక నిరాశ చెందుతుండడంతో, అధిక లాభాలు వచ్చే మిరప, ఉల్లి, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలతో పాటు వివిధ రకాల పూల తోటలు పెంచుతున్నారు. బంతి, చామంతి, గులాబీ తదితర పూల పంటను సాగుచేస్తున్నారు. హైదరాబాద్ మార్కెట్ దగ్గరగా ఉండడం, రవాణా ఖర్చులు తగ్గడం కూడా ఈ సాగుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

లాభాల బాటలో బంతి సాగు

కంది మండలంలోని జుల్‌కల్, తోపుగొండ, చెర్లగూడెం, కలివేముల, ఉత్తర్‌పల్లి, ఎద్దుమైలారం వంటి గ్రామాల్లో ఆరు నెలల కాలంలో చేతికి వచ్చే బంతిపూల పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఒకే రకం పంటలు కాకుండా, వివిధ రకాల వాణిజ్య పంటలు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. బంతి పూల సాగు ఇతర పంటల కన్నా లాభదాయకంగా ఉందని రైతులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ సహకారం అందితే, పూల సాగు విస్తీర్ణం మరింత పెంచడానికి అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


విత్తనాల కోసం ఎండబెట్టిన పూలు

మార్కెట్‌లో భలే డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి, బతుకమ్మ పండుగల నుంచే బంతిపూలకు డిమాండ్ బాగా పెరిగింది. దసరా, దీపావళి, కార్తీకమాసం పూజలతో పాటు, జనవరి 15 వరకు కొనసాగే అయ్యప్పస్వామి పూజలకు బంతిపూలను ఎక్కువగా వినియోగిస్తారు. అంతేకాక, పెళ్లిళ్ల, శుభకార్యాలు, గృహ ప్రవేశాల వంటి సందర్భాల్లోనూ బంతిపూలకే ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బంతిపూలు రూ.50 నుంచి రూ.120 వరకు అమ్ముడవుతున్నాయి

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

నాణ్యమైన బంతిపూల విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే, ఎకరానికి దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. వాతావరణ పరిస్థితులను బట్టి, ఈ పంట నాలుగు నుంచి ఆరు నెలల్లో కోతకు వస్తుంది. ఒకసారి పూలు రావడం మొదలైతే, దాదాపు మూడు నుంచి ఆరు నెలల వరకు రోజు మార్చి రోజు కోయవచ్చు. దీని ద్వారా ఎకరానికి రూ.లక్ష పెట్టుబడితో రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లాభం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

బంతిపూల సాగు పద్ధతి...

బంతిపూల సాగుకు భూమిని సిద్ధం చేసి, విత్తనాలు లేదా 20 రోజుల వయస్సు గల మొలకలను నాటాలి. మొక్కలకు 20 సెం.మీ.ల దూరం ఉండేలా చూసుకోవాలి. ఎకరానికి 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల ఫాస్పరస్ వంటి ఎరువులు వాడాలి. సాగుకు ముందు బాగా చివికిన పశువుల ఎరువును నేలలో కలిపి వేయడం మంచిది. విత్తనాలను ప్రోట్రేలలో లేదా నేరుగా పొలంలో నాటవచ్చు. అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు పూల సరఫరా కోసం జూలై మొదటి వారం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటడం అనువైన సమయం. మొక్కలకు సకాలంలో నీరు పెట్టి, కలుపు తీయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు.

విత్తనాలకు ప్రభుత్వ సబ్సిడీ ఇస్తే బాగుంటుంది



ఇతర పంటల కన్నా బంతి పూల సాగు లాభసాటిగా ఉంది. చెర్లగూడెంలో ఎకరం పొలంలో బంతి నారు తెచ్చి నాటాను. పంట ఏపుగా పెరగడంతో దిగుబడి అధికంగా వస్తోంది. మార్కెట్లో కిలో రూ.50 నుంచి రూ.80 వరకు ధర వస్తోంది. పూల తోటలకు కావలసిన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే బాగుంటది.

- హన్మయ్య, రైతు, చెర్లగూడెం

తక్కువ ఖర్చు.. ఎక్కువ ఆదాయం

బంతిపూల పంటల సాగులో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఉంటాయి. కరువు సమయంలో కూడా ఆదాయం సంపాదించడానికి, ప్రణాళికాబద్ధంగా సాగుచేయాలి. విత్తనాలు కొనేటప్పుడు, మొక్కలు నాటిన తర్వాత చీడపీడల పట్ల జాగ్రత్తలపై ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. అధిక దిగుబడి కోసం సాగు పద్ధతులు పాటించాలి. ముఖ్యమైన పండుగలకు, శుభకార్యాలకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించాలి.

- శైలజ, ఉద్యానవన శాఖ అధికారి


తోపుగొండలో బంతి సాగును పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి శైలజ (ఫైల్)

కంగ్టిలో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం


సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ మారుతిరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంగ్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కంగ్టిలో ప్రభుత్వ సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. 'మద్దతు ఉత్తదేనా?' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కంగ్టి పీఏసీఎస్ వద్ద చైర్మన్ మారుతిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.5328 క్వింటాల్ చొప్పున కొనుగోలు చేయనున్నామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రమేష్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ రోడ్లపై వ్యాపారాలు చేయొద్దు

పోలీసులు, అధికారుల సూచన


వ్యాపారులతో మాట్లాడుతున్న పోలీసులు, అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ రోడ్లపై వ్యాపారాలు నిర్వహించొద్దని వీధి వ్యాపారులు, చిరువ్యాపారులకు అధికార యంత్రాంగం సూచించింది. నగం రోడ్డు సంతకే శీర్షికన రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో మార్కెట్ సౌకర్యం ఉన్నా రహదారులపైనే అమ్మకాలు చేపడుతున్నారనే కథనానికి స్పందించారు. కూరగాయలు, తోపుడు బండ్లు, పండ్లు, ఇతర సామగ్రి విక్రయించే వారికి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా నుంచి డీలీవాలా హోటల్ వరకు, మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, తూప్రాన్ రోడ్డులో రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించద్దని, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. కూరగాయల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులు సమీకృత మార్కెట్‌లో తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలని సూచించారు. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవి కుమార్, ట్రాఫిక్ సీఐ మురళీ, మునిసిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎస్ఐలు రఘుపతి, నీరేశ్ తదితరులున్నారు.

అట్టహాసంగా గురుకుల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మెదక్‌లో జ్యోతి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, హత్నూర అంబేడ్కర్ కళాశాలలో జోన్-6 క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

మెదక్ అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం 11వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, మెదక్ జిల్లాలకు చెందిన గురుకుల క్రీడాకారులు 1,105 మంది హాజరయ్యారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ, ఒలింపిక్స్, సొసైటీ జెండాలను ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థినుల నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల గురుకులాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. అండర్- 14, 17, 19 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, క్యారమ్, హ్యాండ్‌బాల్, రన్నింగ్, బాల్‌బ్యాడ్మింటన్, డిస్కస్‌త్రో, చెస్, అథ్లెటిక్స్ పోటీల జరుగనున్నాయి. తొలిరోజు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. 8 వరకు క్రీడలు కొనసాగనున్నాయి.

హత్నూర గురుకుల విద్యాలయంలో

హత్నూర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హత్నూర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 11వ జోనల్ స్థాయి(జోన్-6) క్రీడోత్సవాలను గురువారం గురుకుల విద్యాసంస్థల డిప్యూటీ సెక్రటరీ రజిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హత్నూర తహసీల్దార్ పర్వీన్‌షేక్, జిన్నారం సీఐ రమణారెడ్డి, హత్నూర ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, హోప్ న్యూరో హాస్పిటల్ ఎండీ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఆనంద్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

కొండపాక జ్యోతబాపూలే పాఠశాలలో

కొండపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండపాక మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల ఆవరణలో గురుకుల పాఠశాలల ఉమ్మడి మెదక్ జిల్లా స్పోర్ట్స్ మీట్ గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ బడుగు సైదులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ జి.తిరుపతి, శ్యామ్‌ప్రసాద్‌లాల్, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్సీవో రాజేశం, సిద్దిపేట జిల్లా కన్వీనర్ బి.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేరళను చూసైనా గుణపాఠం నేర్చుకోవాలి

- స్థానిక ఎన్నికలు త్వరగా నిర్వహించాలి
- సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని రాష్ట్రంగా కేరళ దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందని, ఆ రాష్ట్రాన్ని చూసైనా ప్రధాని మోదీ గుణపాఠం తెచ్చుకోవాలని సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన ఐదు నెలలల్లోపు మళ్లీ నిర్వహించాలని, కేరళలో తూచ తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. కానీ రాష్ట్రంలో 20 నెలలు దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడం తగదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టం అమలు కోసం ప్రధాని మోదీ వద్దకు అఖిలపక్ష పార్టీలను తీసుకెళ్లి ఒత్తిడి తేవాలన్నారు. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని లేనట్లయితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ మద్దతు ఇస్తున్నదని వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పేదలను పోలింగ్ కేంద్రాల వద్దకు రాకుండా చూడాలని వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రి లలన్ సింగ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభను డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, దీనికి 40 దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. మావోయిస్టులతో సహా అన్ని ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కాలవేని శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, హన్మకొండ, కరీంనగర్ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ తదితరులున్నారు.

నకిలీ పత్తి విత్తనాలతో నట్టేట మునిగిన రైతు


భాత లేని పత్తి చేను చూపిస్తున్న రైతు వెంకటయ్య

మద్దూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తి విత్తనాలతో ఓ రైతు మోసపోయిన ఘటన మద్దూరులో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన రైతు బెల్లి వెంకటయ్య 45 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. సాధారణంగా జనగామ జిల్లా కేంద్రం నుంచి పత్తి విత్తనాలు తెచ్చుకునేవాడు. ఈసారి మద్దూరులోని శ్రీరామ ఫర్టిలైజర్ షాపు యజమాని సంపత్ 'నంబర్ ఏక్' విత్తనాలు ఇస్తానని నమ్మబలకడంతో అక్కడే కొనుగోలు చేశాడు. వెంకటయ్య పలు రకాల విత్తనాలను కలిపి మొత్తం 18 ప్యాకెట్లు తీసుకుని 5 ఎకరాల్లో సాగు చేశాడు. పత్తి మొక్క ఆరు అడుగుల ఎత్తు పెరిగినా కాయ మాత్రం రాలేదని వాపోయారు. మొత్తం 5 ఎకరాల్లో పది క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని, దీంతో తాను నిండా మునిగానని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరానికి 1.20 లక్షలు ఖర్చు చేసినట్లు, కూలీలకు మాత్రమే రూ.60 వేలు ఖర్చయ్యాయని ఆయన వివరించారు.

దిగుబడి లేకపోవడంతో ఆవేదన చెందిన వెంకటయ్య, పత్తి మొక్కలతో సహా ఫర్టిలైజర్ షాపు వద్దకు వెళ్లి యజమాని సంపత్‌ను నిలదీశారు. దీనికి సంపత్, పొలానికి వచ్చి పరిశీలించాల్సి ఉంటుందని, కంపెనీ విత్తన సరఫరాదారులకు సమాచారం అందించానని, వారు వచ్చి చూశాక చెబుతానని దాటవేస్తున్నట్లు వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని విత్తనాలతో నష్టపోయినందుకుగాను తనకు నష్టపరిహారం కట్టివ్వాలని వెంకటయ్య డిమాండ్ చేస్తున్నారు. ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతున్న నేపథ్యంలో, వ్యవసాయశాఖ, పోలీస్ అధికారులు వెంటనే ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ముదిమాణిక్యం పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

- మూఢనమ్మకాలని కాళ్లతో చెరిపివేసిన హెచ్‌ఎం
- తరగతులకు హాజరుకాని విద్యార్థులు


నక్షత్ర ఆకారంలో గీసిన పటం

పుల్‌కల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యం పాఠశాల ప్రాంగణంలో జరిగిన క్షుద్రపూజల సంఘటన గురువారం కలకలం సృష్టించింది. బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలు ఉన్న ఒకే ప్రాంగణంలో నక్షత్ర ఆకారంలో ముగ్గులు వేసి, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, దిష్టిబొమ్మలు ఉంచారు. ఉదయం పాఠశాల ప్రధాన ద్వారం వద్దకు వచ్చిన పారిశుధ్య కార్మికురాలు స్వరూప ఈ దృశ్యాన్ని చూసి భయపడి తాళం తీయలేకపోయింది. విషయం గ్రామస్థులకు తెలియడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాల వద్దకు భారీగా తరలి వచ్చారు. భయంతో విద్యార్థులు బయటే ఉండిపోగా, విధులకు హాజరైన ఉపాధ్యాయులను కూడా లోపలికి వెళ్లొద్దంటూ గ్రామస్థులు వారించారు. అప్పుడే వచ్చిన ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి ఈ పరిణామాలను గమనించి, మూఢనమ్మకాలను నమ్మవద్దంటూ నచ్చజెప్పారు. అనంతరం సీసీ రోడ్డుపై ఉన్న పటం, పూజా సామగ్రిని కాళ్లతో చెరిపివేసి, గ్రామపంచాయతీ నుంచి ట్యాంకర్‌ను తెప్పించి ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. అయినా తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను వెంటబెట్టుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో గురువారం పాఠశాల తరగతులు జరగలేదు. పాఠశాల ప్రాంగణంతో పాటు గ్రామానికి నలుదిక్కుల రహదారులపైనా పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, టెంకాయలను వస్త్రంలో కట్టి ఉంచడం స్థానికుల్లో మరింత ఆందోళన పెంచింది. హెచ్‌ఎం మాధవరెడ్డి ఎంఈవో శంకర్, డీఈవో వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఘటన గురించి తెలుసుకున్న పుల్కల్ ఎస్సై విశ్వజన్ పాఠశాలను సందర్శించి, హెచ్‌ఎం మాధవరెడ్డితో మాట్లాడారు. ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పనులు చేస్తుంటారని, ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని, విద్యార్థులు నిర్భయంగా తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులు అంతర్జాతీయస్థాయి మార్కెటింగ్‌తో పోటీపడాలి

సంగారెడ్డి జిల్లా ఫలపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుచిత్ర

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలతో అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేలా పోటీపడాలని సంగారెడ్డి జిల్లా ఫలపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుచిత్ర పేర్కొన్నారు. జహీరాబాద్ రంజోల్‌లోని రైతువేదికలో అల్లం సాగుపై గురువారం జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి పండరి, వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతితో కలిసి పాల్గొన్న ఫలపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుచిత్ర మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ, సేంద్రియ పద్ధతులను పాటించడం లేదన్నారు. రసాయనాలను ఎక్కువ మోతాదుల్లో వాడడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మన పంటలు రిజక్ట్ అవుతున్నాయని విచారం వ్యక్తంచేశారు. మార్కెట్‌కు అనుగుణంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ ప్రాంతం వాణిజ్య పంటల సాగుకు యోగ్యమైనదన్నారు. తెలంగాణలో సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో అల్లం పెద్దమొత్తంలో సాగవుతుందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాజేందర్‌నగర్ విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బ్రహ్మోత్సవాలకు రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం ముస్తాబు


ఆలయానికి వేసిన రంగులు

కంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఏటా కార్తీకమాసం రెండో వారంలో నిర్వహించే కందిలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కందిలోని పురవీధుల్లో లైటింగ్ కోసం పదుల సంఖ్యలో బారికేడ్లు నిర్మించారు. వారం రోజుల పాటు జాతర కొనసాగనున్నది. ఆలయ ధర్మకర్తలు గురువారం కరపత్రాలను విడుదల చేశారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, బీడీఎల్ పరిధిలోని బానూరు స్టేడియంలో మార్నింగ్ వాకర్లకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి బయటపడేందుకు అవగాహన ముఖ్యమన్నారు. ఈజీ మనీ, మల్టీలెవల్ మార్కెటింగ్, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, తక్కువ పెట్టుబడితో వ్యాపారాలు ప్రారంభించవచ్చని, ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు ఆన్‌లైన్ ద్వారా మోసం చేసేందుకు ప్రయత్నిస్తారన్నారు. ఇలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 48 గంటల్లోపు 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా ఎన్సీఆర్పీ(సైబర్‌క్రైమ్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బానూర్ సీఐ విజయ్‌కృష్ణ, సైబర్ క్రైమ్ సీఐ రవి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై కేసు

రామాయంపేట, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : వాహనాలకు ఆటంకంగా రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై కేసు నమోదైంది. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట హైవేపై రైతు ఇప్ప మల్లేశం రెండు రోజుల క్రితం పంట ఆరబోశాడు. బుధవారం రాత్రి రామయంపేట నుంచి మెదక్ వైపు వెళ్తున్న రెండు ప్రయాణికుల ఆటోలు కుప్పలు అడ్డంగా ఉండడంతో అదుపుతప్పి బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో 13 మంది గాయాలపాలవగా, స్థానిక ఎస్సై బాలరాజ్ గురువారం ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. వాహనాల రాకపోకలకు ప్రమాదంగా ధాన్యం పోశారని తేలింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

డ్రంకెన్ డ్రైవ్ నిందితులకు జరిమానా, జైలు

గజ్వేల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో 12 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ విచారణ జరిపారు. తొమ్మిది మందికి రూ.67 వేల జరిమానా, మరో ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.7వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళీ తెలిపారు. అలాగే మరో ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.1000 జరిమానా, ముగ్గురికి రూ.30వేల జరిమానా విధించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న అన్నదమ్ములు.. కేసు నమోదు

రాయపోల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ములు ఒకరిపై ఒకరు గడ్డపార, గొడ్డలితో దాడి చేసుకోవడంతో ఇరువురు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్కల్ గ్రామానికి చెందిన పిట్ల నర్సింహులు బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని రాత్రి టపాసులు కాల్చాడు. ఈ క్రమంలో ఒక నిప్పురవ్వ అకస్మాత్తుగా ఆయన తమ్ముడు పిట్ల రమేష్ ఆటోపై పడింది. ఈ విషయంలో అన్నదమ్ములు ఇద్దరూ గొడవ పెట్టుకోగా పిట్ల నర్సింహులు తన తమ్ముడు యగు పిట్ల రమేష్‌పై గడ్డపారతో దాడి చేశాడు. దీంతో పిట్ల రమేష్ తన అన్న పిట్ల నర్సింలుపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ గొడవలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

రాయపోల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని పెద్దమ్మ ఆలయాల్లో దొంగతనాలు ఆగడం లేదు. వారం రోజుల క్రితం అనాజీపూర్, లింగారెడ్డిపల్లి, పెద్దమ్మ ఆలయాల్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా రాయపోల్ మండలం కొత్తపల్లి పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామంలోని టెంకంపేట రహదారిలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో గ్రామస్తులు రోజు శుభ్రం చేసి పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పూజలు చేసిన అనంతరం గేటుకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఆలయానికి వెళ్లగా గేటు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసి బంగారుపుస్తెలు, మట్టెలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అలాగే సీసీ టీవీకి సంబంధించిన పరికరాలు కూడా ఎత్తుకెళ్లారు.

సీపీఐ నియోజకవర్గ కన్వీనర్‌గా సత్యనారాయణగౌడ్

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నియోజకవర్గ కన్వీనర్‌గా అక్కన్నపేటకు చెందిన జాగీర్ సత్యనారాయణ గౌడ్‌ను ఎన్నుకున్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో జరిగిన సీపీఐ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కనుకుంట్ల శంకర్, కోకన్వీనర్లుగా అందె స్వామి, అదిరి శ్రీనివాస్, కోశాధికారిగా గడిపె మల్లేశ్‌తో పాటు 43 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్ హాజరయ్యారు.

సామాజిక తనిఖీలో రూ.11వేల జరిమానా

గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.11 వేల జరిమానా విధించారు. అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, ఏపీడీ సతీష్, క్వాలిటీ కంట్రోల్ సంతోష్, ఎస్ఆర్‌పీ పాండురంగ ఆధ్వర్యంలో తొమ్మిది మంది డీఆర్‌పీలు ఈ తనిఖీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25 గ్రామ పంచాయతీల పరిధిలోని పనులపై తనిఖీ నిర్వహించగా, 11 మందికి రూ.11వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో మొత్తం రూ.2.15లక్షలపై ఆరోపణలు రావడంతో, అడిషనల్ డీఆర్‌డీవో విచారణకు ఆదేశించారు. గజ్వేల్ ఎంపీడీవో ఆరె ప్రవీణ్‌కుమార్, ఎంపీవో దయాకర్, ఏపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న నిర్వహించే స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని హుస్నాబాద్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రేవతి అన్నారు. గురువారం హుస్నాబాద్ కోర్టులో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం. రాజశేఖరరెడ్డి, పీపీ ఎంకే నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, న్యాయవాదులు హన్మయ్య, మల్లేశం పాల్గొన్నారు.

స్వర్ణనిధి డిపాజిట్‌ను సద్వినియోగం చేసుకోండి

● డీసీసీబీ మేనేజర్ నాగభూషణం

జగదేవ్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు, రైతులు, సీనియర్ సిటిజన్స్ స్వర్ణనిధి డిపాజిట్లు చేసి అధిక వడ్డీ పొందాలని డీసీసీబీ మేనేజర్ నాగభూషణం కోరారు. గురువారం డీసీసీబీ జగదేవ్‌పూర్ బ్రాంచ్ కార్యాలయంలో డిపాజిట్ల సేకరణ మాసోత్సవంలో భాగంగా స్వర్ణనిధి డిపాజిట్ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ, బ్యాంకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు అందిస్తోందని, స్వర్ణనిధి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ గోవర్ధన్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకెన్ని ప్రాణాలు పోవాలె?

● మల్లంపల్లి, మోత్కులపల్లి వాగులపై వంతెనలు లేక ప్రజల ఇబ్బందులు
● ఇటీవల వచ్చిన వరదల్లో ముగ్గురు గల్లంతై మృతి
● చౌటపల్లి వాగు బ్రిడ్జికి శంకుస్థాపన జరిగినా మొదలు కాని పనులు


అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి వాగు

అక్కన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాగులపై వంతెనలు లేక అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి చుట్టూ ఉన్న దారునూతి వాగు, చౌటపల్లి వాగు, మోత్కులపల్లి వాగులపై వంతెనలు లేకపోవడంతో, వానాకాలంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తకొండకు మల్లంపల్లి గ్రామం మీదుగా రాకపోకలు సాగుతాయి. ఇటీవల మొంథా తుపాను కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కాగా, మల్లంపల్లి దారునూతి వాగులో మల్లంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి రామకృష్ణ, మోత్కులపల్లి వాగులో ఇసంపల్లి కల్పన, ప్రణయ్ దంపతులు ద్విచక్రవాహనంపై వరదను దాటుతూ గల్లంతై మృతి చెందారు.


మోత్కులపల్లి వాగు

శంకుస్థాపనకే పరిమితం..

చౌటపల్లి వాగుపై వంతెన నిర్మాణానికి సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.కోటి కేటాయించారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ సెప్టెంబర్ 12న శంకుస్థాపన చేసినప్పటికీ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి వంతెనల నిర్మాణాలకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి

● కలెక్టర్ హైమావతి

కొండపాక/కుకునూరుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. గురువారం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కుకునూరుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో పిల్లల హాజరుకు తగ్గట్టుగా బియ్యం, వంట సరుకులు అందించాలని, వంట ప్రక్రియను తరచుగా తనిఖీ చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆమె ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఆమె వెంట కుకునూరుపల్లి ఎంఈఓ సత్తయ్య పాల్గొన్నారు.


తిమ్మారెడ్డిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థి దశలో క్రీడలు ఎంతో ముఖ్యం : డీఐఈవో

● డీఐఈవో రవీందర్ రెడ్డి

సిద్దిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆటలలో ప్రావీణ్యం సాధిస్తే మంచి క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంటుందని డీఐఈవో రవీందర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాలలో గురువారం 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రీడలలో పాల్గొనడం వలన మేధాశక్తితో పాటు శారీరక దారుఢ్యం పెరిగి, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు సంబంధించి 15 గురుకుల కళాశాలల నుంచి 1275 మంది విద్యార్థులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మాంజలి, డీసీవో నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న డీఐఈవో

8న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

కొండపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం దుద్దెడలో ఈ నెల 8న ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ విభాగం క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆయుష్ విభాగం, రామంతపూర్ దర్మకిరణ్ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ వినియోగించుకొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

మర్కూక్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మర్కూక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ పాఠవాలను మండల విద్యాధికారి వెంకటరాములు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సరదాగా గడిపారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి, శానిటేషన్, టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఏడవ, ఐదవ తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి, గణితంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంతోషిమాత, హారిక, స్వాతి, అంజలి, నవీన తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

మద్దూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో ఎస్. రాంమోహన్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోని రేబర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా, తేమ శాతం పరిశీలించి, ఎప్పటికప్పుడు కాంటా వేసి మిల్లులకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ మాధవ్ జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

సిద్దిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను త్వరగా అమలు చేయాలని మిరుదొడ్డి మండల బీసీ జేఏసీ కన్వీనర్ తుమ్మల బాల్‌రాజు డిమాండ్ చేశారు. గురువారం మిరుదొడ్డి అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ సంఘాల నాయకులతో కలిసి మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని బీసీ జనాభా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు దేవరాజు, రాములు, విద్యాసాగర్, అమర్, యాదగిరి, కిష్టయ్య, ఐలయ్య, స్వామి, హేమ్యాద్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం, రథోత్సవం

గజ్వేల్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి జాలిగామ గ్రామంలోని హరిహరనాథ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం, రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బండారి సీతారాం రావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో నాచారం డైరెక్టర్ నాయికం శ్రీనివాస్, తాజా మాజీ ఎంపీటీసీ బూరుగుపల్లి రాజిరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుమ్మరి ఆనంద్, గజ్వేల్ మండల్ ఆత్మ కమిటీ డైరెక్టర్ గంధ రాజలింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌పై ప్రభుత్వ అక్కసు తగదు

● బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్

చేర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మొహం చాటేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ పట్ల అక్కసు వెళ్లగక్కడం తప్ప ప్రజా సంక్షేమం పట్టడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ అన్నారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం జరిగిన బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ కృషితో పాటు ఎంతోమంది అమరుల త్యాగాల పునాదులపై పురుడుపోసుకున్న తెలంగాణను కాపాడుకునే బాధ్యతతో బీఆర్ఎస్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ప్రజల తరఫున పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తుండటాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. జనగామ జిల్లా గానుగుపహాడ్‌లో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. ఎన్ని కేసులు బనాయించినా తాము వెరవబోమని, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైన్యంగా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గర్నపల్లి చంద్రం, షేక్ సుభాని, నరేశ్, సాయిలు, గణేశ్, హామీన తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో వైభవంగా కార్తీక దీపోత్సవం

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులలో దీపాలను పెట్టి అలంకరించారు. కళాశాల ప్రాంగణంలో ఉసిరి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి, అధ్యాపకులు అనిల్‌కుమార్, నైనాదేవి, బాలరాజు, చంద్రమౌళి, సుధా మాధురి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరిస్తాం

● ఆర్‌అండ్‌బీ డీఈఈ

సిద్దిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా మారిన అందె రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి వెళ్లే రోడ్డును ఆయన పరిశీలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ద్వారానే నవసమాజ నిర్మాణం సాధ్యమని గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో విద్యాధికారి యెలగందుల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 24 మంది ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఎస్టీవో ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరీమొద్దీన్, భాస్కర్, బసవరాజ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మూసుకున్న కెనాల్ గేట్లు

(5వ పేజీ తరువాయి)

సుమారు 60 ఎకరాల వరి, 40 ఎకరాల పత్తి పంట నీటిలో మునిగి దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం కొండపోచమ్మ ప్రాజెక్టు వద్దకు చేరుకొని గేట్ల మూసివేత పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గేట్లు మూసివేసిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ లక్ష్మణ్, సీఈ శివధర్మ తేజ్, ఈఎన్‌సీ జనరల్ హమ్మత్ హుస్సేన్, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిప్.. ట్రాప్

(5వ పేజీ తరువాయి)

ఆశ చూపి, మత్తులో దింపి దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ నిర్వాహకుల ఆట కట్టించాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

దోపిడీ కోసమే ఉచిత విదేశీయానం

విదేశీయానాన్ని ఆశగా చూపితే యువత, ప్రజలు మోసపోవద్దు. ఎవరూ ఫ్రీగా విదేశాలకు తీసుకువెళ్లరు. ఉచితంగా విదేశాలకు తీసుకువెళ్తున్నారంటేనే లోతుగా ఆలోచన చేయాలి. అక్కడ ఏదో మోసం ఉందని గుర్తించాలి. విదేశాలకు వెళ్లాలని కలలు కనేవారు ఇలాంటి ఆశలకు లోను కావొద్దు. అప్పులు చేసి ఆగం కావద్దు. ఇటీవల కాలంలో గజ్వేల్‌లో ఈ సంస్కృతి భారీగా విస్తరించినట్లుగా తెలుస్తోంది. యువత, ప్రజలు ఆలోచన చేసి ముందడుగు వేయాలి.

- మల్లికార్జున్, ఉపాధ్యాయుడు, గజ్వేల్



చేర్యాలలోని సీసీఐ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కపాస్ కిసాన్‌ను రద్దు చేయాలి : సీపీఐ

చేర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు శరాఘాతంగా మారిన కపాస్ కిసాన్ యాప్‌ను రద్దుపరచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చేర్యాల పట్టణ శివారులోని వాసవీ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ... చేతికందిన పంటను అమ్ముకునేందుకు సీసీఐ కొర్రీలు పెట్టడం తగదన్నారు. గతంలో ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసిన సీసీఐ, ప్రస్తుతం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామని చెప్పడం సరికాదన్నారు. పాత పద్ధతిలో పత్తి కొనుగోలు చేపట్టాలని, లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఈరు భూమయ్య, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, పొనుగోటి శ్రీనివాస్‌రెడ్డి, ఎగుర్ల ఎల్లయ్య, నంగి సత్తయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కొమురవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'కిసాన్ కపాస్ యాప్'ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. కొమురవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తాడూరి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దపడగ కృష్ణారెడ్డి, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

తొగుట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. గురువారం తొగుట మండలం కాన్గల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాల పట్ల జరిగే అనర్థాలను వారికి సవివరంగా వివరించారు. మహిళలు, విద్యార్థినులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నిర్భయంగా షీ టీమ్ నంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవికాంతరావు, పాఠశాల హెడ్ మాస్టర్ మధు, గజ్వేల్ షీ టీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుళ్లు మహేందర్‌రెడ్డి, మహేశ్, ఆంజనేయులు, విలేజ్ పోలీస్ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తొగుట సీఐ లతీఫ్

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

సిద్దిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. సైబర్ జాగృతి దివాస్‌ను పురస్కరించుకుని గురువారం సిద్దిపేట మెడికల్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆశ, భయము పేరుతో సైబర్ నేరగాళ్లు బెదిరించి, మభ్యపెడతారని తెలిపారు. మెడికల్ కాలేజ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిద్దిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను ఏఈఓ పవన్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మిట్టపల్లి గ్రామ రైతులు వరికోలు నారాయణ, ఎల్లయ్య, బాస బాబు, సంతోష్, నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్

కాంగ్రెస్ విజయం కోసం మల్లన్నకు ముడుపు

కొమురవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలోని గంగిరేణి చెట్టుకు కాంగ్రెస్ నాయకులు గురువారం ముడుపు కట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మేర్గు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు, నవీన్ యాదవ్ విజయం సాధించాలని మల్లికార్జున స్వామిని వేడుకొని ముడుపు కట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్రోజు శంకరచారి, ఏర్పుల రాజు, ఉప్పల వంశీ, యెనిశెట్టి కిరణ్, కొయ్యడ ప్రశాంత్ పాల్గొన్నారు.


గంగిరేణి చెట్టుకు ముడుపు కడుతున్న కాంగ్రెస్ నేతలు

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ

అక్కన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని శ్రీరామ్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు కోడిగుడ్లను పంపిణీ చేశారు. వాటిని ఇంటికి తీసుకువెళ్లి నీళ్లలో గుడ్లను వేసి చూడగా అవి పైకి తేలాయి. దీంతో వాటిని పగలగొట్టి చూడగా కుళ్లిపోయి కనిపించాయి. వాటి నుంచి దుర్వాసన వచ్చింది. వెంటనే లబ్ధిదారులు ఆ కోడిగుడ్లను తిరిగి తీసుకువెళ్లి అంగన్‌వాడీ టీచర్‌కు చూపించి గొడవకు దిగారు. వీటిని మా పిల్లలు తింటే ఏమైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీలు నాణ్యమైన గుడ్లు సరఫరా చేయకపోవడంతోనే గుడ్లు కుళ్లిపోయి వస్తున్నాయని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి సదరు ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.